# జయద్రథుడు

మహావీరుడైన జయద్రథుడు సాళ్వకన్య స్వయంవరోత్సవానికి వీరోత్సాహంతో ప్రయాణమయ్యాడు. క్షాత్రధర్మమంటే జయద్రథునికి అమితమైన ప్రీతి. ప్రజలను అన్ని విధాలా కాపాడుతూ, రాజధర్మాన్ని సక్రమంగా నిర్వర్తిస్తున్నానని ఎల్లప్పుడూ తృప్తి చెందేవాడు. ధృతరాష్ట్ర మహారాజు తన పుత్రిక దుస్సల నిచ్చి తనకి వివాహం చేయటం కేవలం తన శౌర్యపరాక్రమాలను గుర్తించి, తనతో స్నేహసంబంధాలు పెంచుకుందుకి మాత్రమేనని అనుక్షణం గర్వపడుతూ ఉంటాడు జయద్రథుడు. ఆ వివాహం రాజకీయమైన వివాహంగానే భావించా డతడు.

స్వయంవరంలో కన్యని గెల్చుకుంటే తన క్షాత్రధర్మం, తన వీరత్వం అతిశయిస్తాయనే నమ్మకం బాగా నాటుకుపోయిం దతనికి.

చతురంగ బలాలతో, ఆప్తులైన స్నేహితులతో, సపరివారంగా ప్రయాణం సాగిస్తున్నాడు జయద్రథుడు. స్నేహితుడైన కోటికాస్యుడు అతనితో సరస సంభాషణ చేస్తుంటే, ప్రకృతి శోభను తిలకిస్తున్నాడు. రథం వేగంగా ప్రయాణిస్తుంటే జయద్రథుని మనసు ఆనందంతో పరవశించింది. రథచక్రాల ధ్వని అతనికి మధురంగా వినిపిస్తోంది.

సాళ్వకన్యను గెల్చుకుని మరలి వస్తున్నట్టే ఊహాపథంలో తేలిపోతున్న జయద్రథునికి ఆ అరణ్యప్రాంతంలో ఒక దృశ్యం అడ్డు తగిలింది. రథ వేగాన్ని తగ్గించాడు.

అది ఆశ్రమ ప్రాంతం. ఒక విశాలమైన వృక్షాన్ని అల్లుకుంది అందమైన ఓ పూలతీగ. ఆ పూలతీగపైన చేయాన్చి, ప్రకృతి శోభను తిలకిస్తూ, వయ్యారంగా నిలబడింది ఒక సుందరాంగి.

ఆమె నుంచి చూపు మరల్చుకోలేకపోయాడు జయద్రథుడు. ఆమె చేతివేళ్ళు ఆ తీగపైన నిలిచి, చిగురుటాకుల్లా ఎర్రగా ఉండి, అగ్నిశిఖల్లా భాసించాయి అతని కళ్ళకి. రథాన్ని మరింత నెమ్మదిగా నడిపాడు జయద్రథుడు.

రథం అక్కడి నుంచి ముందుకు కదలలేదు. ఆమెను శ్రద్ధగా పరిశీలిస్తున్నాడతను దూరం నుంచి. ఆమె దేవతామూర్తిలా కనిపించిం దొకసారి. ఆమె వనదేవతలా ఒప్పింది మరొక్కసారి. వన విహారాని కొచ్చిన రతీదేవిలా కనిపించింది ఇంకొకసారి. అతని మనసు మన్మథ వివశమైంది. అతని చూపు ఆమెపైన నిలిచిపోయింది. ఈమె తన హృదయేశ్వరి అయితే, తను ముల్లోకాలు గెలిచినంత తృప్తి చెందుతాడు. జయద్రథుడు ఇక అక్కడ ఆమెను చూస్తూ నిలవలేకపోయాడు.

తనే స్వయంగా వెళ్ళి ఆమెను ప్రేమభిక్ష పెట్టమని అర్థిస్తే? ఆ ఆలోచన వచ్చినంతలోనే తన ఇష్టసఖుడు కోటికాస్యుడు ఎదురుగా కనిపించాడు. జయద్రథునికి కొండంత బలం వచ్చింది.

తన మనోవేదన స్నేహితునికి విన్నవించాడు. ఎలాగైనా ఆమె సాంగత్యం తనకు చేకూర్చమని స్నేహితుణ్ణి కోరాడు. ఆమెతో కలసి ప్రేమ సామ్రాజ్యాన్ని ఏలకపోతే తన జన్మ నిరర్థకమని వాపోయాడు మహారాజు జయద్రథుడు.

కోటికాస్యుడు ఆమె వద్దకు వెళ్ళి. అతి వినయంగా - "తమ రెవరో తెలుసుకోవచ్చా?" అన్నాడు. ఆ గొంతు విని ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది ఆమె.

"నేను సురథుడనే రాజపుత్రుణ్ణి. నా పేరు కోటికాస్యుడు. అటు చూడండి. ఆ రాజకుమారులు సేవిస్తూ ఉన్నవాడు, ఆ మహావీర శౌర్య ప్రతాపధనుడు, సింధు సౌవీరనాథుడైన జయద్రథుడు. అతడే సైంధవుడు." కోటికాస్యుడు మాటలు ఆపి ఆమె వంక చూశాడు.

"తమరి గురించి తెలుసుకురమ్మని నన్ను పంపిన అతడు నా ప్రాణ స్నేహితుడు."

ఆమె తత్తరపాటుతో చీరకొంగు సరిచేసుకుంది. "నేను అరణ్యంలో ఒంటరిగా లేను. మహావీరులైన పాండవుల ధర్మపత్నిని నేను. నీవు సురథ పుత్రుడవైన కోటికాస్యుడవని నేను గుర్తించాను. పాండవ కుమారులు వేట కని వెళ్ళినవారు ఇప్పుడే వస్తారు. వారి అతిథి సత్కారాలు స్వీకరించి వెళ్ళండి."

కోటికాస్యునికి ఆమె మాటలకు ఏం చెప్పాలో తోచలేదు. అతివేగంగా స్నేహితుణ్ణి సమీపించాడు. కోటికాస్యుని మాటలు జయద్రథునికి తీరని నిరాశ

కలిగించాయి. మదనావేశ పరవశుడైన అతను వేగంగా తానే స్వయంగా బయ ల్దేరి ఆ ప్రాంతానికి వచ్చాడు.

అతన్ని చూడగానే ఆమెకు ఒక విధమైన భయం కలిగింది. అయినా అది మనసులో దాచుకుని- "వేట కేగిన నా భర్తలు వస్తా రిప్పుడే. నీకు సపర్యలు చేస్తారు" అంది నెమ్మదిగా.

సైంధవుడు చిరునవ్వు నవ్వాడు.

"నీ అతిథి పూజలతో మాకు పనేలేదు. చల్లకొచ్చి ముంత దాచటం నాకు రాదు. నిన్ను చూసిన క్షణమే నా మనసు నీపైన లగ్నమైంది. ఈ మన్మథ బాధ ఇక తాళలేను. పాండవులతో పాటు అరణ్య భూమిలో కష్టాలు పడుతుం డటం నీకు తగదు. సింధుసౌవీరాధినాథుడనైన నేను నిన్ను చేపట్టి, సర్వాలంకార భూషితురాలను చేసి, సమస్త భోగాలలో తులతూగేలా చేస్తాను."

జయద్రథుని మాటలు, చూపులు భయాందోళనలు కలిగించాయి ఆమెకి. ఆమె క్షణం నిర్వెర పోయింది.

"దుస్సల భర్తవైన నువ్వు నాకు సోదరుడివి తెలుసా?"

ఆ మాటలకు సైంధవుడు వికటాట్టహాసం చేశాడు. "స్త్రీల విషయంలో వావివరుసలు పాటించటం రాజధర్మం కాదు. నీపైన అమితమైన ప్రేమానురాగా లతో ఇలా అభ్యర్థిస్తున్నాను. నా పరాక్రమం నీకు తెలియక ఇలా ఇలా మాట్లాడు తున్నావు." జయద్రథుడు ద్రౌపది వంక కంటిరెప్ప వేయకుండా చూస్తున్నాడు.

ఇక ఒకటే మార్గ మనిపించింది అతనికి. ఆలస్యం తగదు అనుకుంటూ, ఆమెను బలవంతంగా రథం మీద ఎక్కించుకు పోవాలని నిశ్చయించుకున్నాడు.

తనను సమీపిస్తున్న సైంధవుని తోసిపారేసింది ద్రౌపది. కిందపడి లేచి, తీరని అవమానంతో ద్రౌపదిని రథంపైకి ఎక్కించుకుని మహావేగంతో సాగి పోయాడతను.

ద్రౌపది వేసిన కేకలకు ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. పురోహితుడైన ధౌమ్యుడు వేగంగా ఆ ప్రాంతాని కొచ్చాడు.

అంతలో వేట కేగి, మరలి వస్తున్న పాండవులు సంభ్రమాశ్చర్యాలతో, పరిచారికల ద్వారా జరిగిన విషయం విన్నారు.

పాండవు లైదుగురూ జయద్రథ సేనానివహాన్ని తెగటార్చి, అతని రథాన్ని చుట్టుముట్టారు. సైంధవుడు వారికి లొంగిపోవటమే కాక, వారిచేత అవమానితుడైనాడు. భీమార్జునులు శిరోముండనం చేసిన సైంధవుణ్ణి ద్రౌపది ముందర నిలబెట్టారు.

"నేటినుంచి పాండవ దాసుడినని అన్ని సభలలోనూ చెప్పుకోవాలి" అన్నారు భీమార్జునులు.

సైంధవుడు తల వంచాడు. అతని శిరస్సు ఖండించమని చెబుదామనుకున్న ద్రౌపది కళ్ళకు దుస్సల కనిపించింది.

ఆ దుర్మార్గుణ్ణి చంపి, ఇంటి ఆడబిడ్డకు అన్యాయం చేయరాదనే భావంతో సైంధవుణ్ణి క్షమించారంతా.

ద్రౌపది సైంధవుణ్ణి చూసి పకపకా నవ్వింది.

సైంధవుడు తన ప్రేమ ఇలా విఫలమైనందుకూ, తనకు తీరని అవమానం కలిగినందుకూ లోలోన దుఃఖించాడు.

కాని, ద్రౌపదిపైన తనకున్న ప్రేమ భగ్నమైనందుకు, ఆ ప్రేమనే కసిగా మార్చుకొని తలవంచుకుని మరలిపోయాడు ఆ ప్రాంతంనుంచి-సైంధవుడైన జయద్రథుడు.

*

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం :
అరణ్యపర్వం : షష్ఠాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 6-4-1988)